www.vishalabharati.com
epaper:vishalabharati.com
శనివారం, హైదరాబాద్
09 సెప్టెంబర్ 2023

# విశాల భారతి
GREATER HYDERABAD
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

మీకు వత్తిడి లేని జర్నలిజంపై ఆసక్తి ఉందా..? అయితే మీకు ఆ అవకాశాన్ని మేం కల్పిస్తాం. స్థానిక సమస్యలపై అవగాహనతో కూడిన అనుభవం ఉంటే చాలు.. సమాజహితమే లక్ష్యంగా వెలువడి, ఎంతో నిబద్ధతతో తక్కువ కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్న 'విశాల భారతి' తెలుగు దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరబాద్ మెదక్ జిల్లాల్లో పనిచేసేందుకు జిల్లా ఇన్‌చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను. జర్నలిజంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

సంప్రదించవలసిన నంబర్లు
ఫోన్ : 85004 62531,99084 15381
మెయిల్ : ashokvbnews@gmail.com



## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



- అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ టీపీఆర్
- సీసీ రోడ్లు, ప్యాచ్ పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు(అమీన్ పూర్)విశాలభారతి:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి (టీపీఆర్) అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో ఇండస్ వ్యాలి సొసైటీలో సుమారు పది లక్షల అంచనా వ్యయంతో మున్సిపల్ నిధులతో సిసి రోడ్లు, ప్యాచ్ పనులకు చైర్మన్ పాండురంగా రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులలో ముందస్తు ప్రణాళికలో ముందుకు పోతున్నామని చెప్పారు. కొత్త మున్సిపాలిటీ అయినా తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలకు పోటీగా అభివృద్ధి కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్, కో ఆప్షన్ సభ్యులు యూనుస్, బిఆర్ఎస్ నాయకులు జనార్దన్ రెడ్డి, దాసు యాదవ్, మహేష్, విజయ్, కాలనీ ప్రెసిడెంట్ భవ, వైస్ ప్రెసిడెంట్ నరసింహ, జనరల్ సెక్రెటరీ ప్రవీణ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# కోట్లాది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు గద్దర్

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### పటాన్ చెరులో ప్రజా యుద్ధనౌక గద్దర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ
### రూ.30 లక్షల ఎమ్మెల్యే సొంత నిధులతో 11 అడుగుల కాంస్య విగ్రహం



**పటాన్ చెరు, విశాలభారతి :**
ప్రజా యుద్ధనౌక గద్దర్ కోట్లాది తెలంగాణ ప్రజల గుండెచప్పుడు అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తొలి, మలి దశ తెలంగాణ పోరాటాలలో కీలక భూమిక పోషించడంతో పాటు తన పాటలతో తెలంగాణ జాతిని ఏకం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని ఆయన కొనియాడారు.

పటాన్ చెరు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కన బస్టాండ్ సమీపంలో 30 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న 11 అడుగుల కాంస్య విగ్రహ ఏర్పాటునకు శుక్రవారం శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా పటాన్ చెరులో 11 అడుగుల గద్దర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. సాధారణ బుర్రకథ కళాకారుడుగా ప్రారంభమైన గద్దర్ కళాజీవితం, విప్లవ రాజకీయాలతో మమేకమై, అనంతర కాలంలో తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమంలో సాంస్కృతిక పోరాటంలో ఉన్నతస్థాయికి చేరిందన్నారు.

కవిగా గద్దర్ ప్రజా కళలకు, ఉద్యమాలకు చేసిన సేవలు మరుపురానివని, వారు లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. తెలంగాణ కోసం తన ఆట పాటలతో ప్రజల్లో స్వరాష్ట్ర చైతన్యాన్ని రగిలించిన గద్దర్ ప్రజాయుద్ధనౌకగా ప్రజల హృదయాల్లో నిలిచారని తెలిపారు. ప్రజలకోసం తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసి ప్రజలకోసమే బతికాడని అన్నారు. అతి త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, ఎస్సిఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు రుద్రారం శంకర్, తెలంగాణ మాల యువసేన రాష్ట్ర కార్యదర్శి గాలి బాబురావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వంగరి అశోక్, ఆదర్శ్ రెడ్డి, దళిత సంఘాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## యువత చూపు బిఆర్ఎస్ వైపు

- ముచ్చటగా మూడోసారి అధికారం టిఆర్ఎస్ పార్టీదే
- ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ

2

## 'రౌడీయిజాన్ని సహించేదిలేదు'



2

# యువత చూపు బిఆర్ఎస్ వైపు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులంతా బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. శుక్రవారం హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన సుమారు 100 మంది యువకులు ఆ డివిజన్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్ కూడా ఆధ్వర్యంలో మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు తెలంగాణలోని ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. అందులో ముఖ్యంగా ఆసరా పించన్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, రైతుబంధు రైతు బీమా ఇలా ఎన్నో సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు. దీనికి ఆకర్షితులై మిగతా పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో వలసలు పెరుగుతున్నాయి అన్నారు.రానున్న ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ దిశగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని గెలిపించుకొని సీఎం కేసీఆర్ కు కానుక ఇద్దామని బాలింగ్ గౌతమ్ గౌడ్ నాయకులు, కార్యకర్తలకు ,పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు,కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,వార్డ్ మెంబర్లు,తదితరులు పాల్గొన్నారు.

# 'రౌడీయిజాన్ని సహించేదిలేదు'

**తుర్కయంజాల్, విశాలభారతి:** ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్‌పై ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం జిల్లా నాయకులు గుండె శివకుమార్, స్టాలిన్, సుమంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సందర్భంగా సంగారెడ్డిలో జెండాలు, తోరణలు కడుతున్న రమేష్‌పై కత్తులు, కర్రలతో ఏబీవీపీ కార్యకర్తలు గూండాల్లా దాడి చేశారని మండిపడ్డారు. దాడులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామన్నారు. సమస్యలపై సైద్ధాంతికంగా చర్చకు రావాలని, గూండాల్లా ప్రవర్తిస్తే... వారికి విద్యార్థులే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. హెచ్‌సీయూలో ఏం జరిగిందో ఏబీవీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.



# 'పారిశుధ్యంపై అవగాహన అవసరం'

**తుర్కయంజాల్, విశాలభారతి:** పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. పురపాలక పరిధిలోని అన్నివార్డుల్లో చెత్తను స్వచ్ఛ్ ఆటోల్లోనే వేయాలని, బహిరంగంగా పడేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాంత్ తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛ ఆటో కార్మికులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాణిజ్య ప్రదేశాలలోని ప్రతి షాపు తిరుగుతూ, చెత్తను బయట వేయరాదని అవగాహన కల్పించారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే రూ.500 నుంచి రూ.5,000 వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. స్వచ్ఛ ఆటోకి చెత్తను ఇవ్వకుండా, బయట చెత్తను వేస్తున్న పలువురు వ్యాపారులకు కమిషనర్ శ్రీకాంత్ కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం నుంచి చెత్తను బహిరంగంగా వేసిన వారిపై అలాగే 120 మైక్రాన్ కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్‌ను వినియోగించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జవాన్లు రవి, శివకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులకు భరోసా

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- సాకి చెరువులో 3 లక్షల చేప పిల్లల విడుదల



**పటాన్ చెరువిశాలభారతి:** ఉచిత చేప పిల్లల పంపిణీతో తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మూడు లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడంతో పాటు, మార్కెటింగ్ సౌకర్యం అందిస్తోందని తెలిపారు. ఈ సదవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు మత్స్య సహకార సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలతో మత్స్య సంపద అభివృద్ధి చెందడంతో పాటు మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, మత్స్య శాఖ జిల్లా అధికారి సతీష్, నగేష్, నివర్తి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్, జగన్ ముదిరాజ్, రాము ముదిరాజ్, శ్యామ్, గుండమొల్ల రాజు, షకీల్, శ్రీధర్ చారి, అజ్మత్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

# గొల్ల కురుమల ఆర్థిక అభివృద్ధి కోసమే గొర్రెల పంపిణీ పథకం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ముత్తంగిలో గొర్రెల యూనిట్ల పంపిణీ



**పటాన్ చెరువిశాలభారతి :** గొల్ల కురుమల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకం ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్ చెరు మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 12 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ గొర్రెల యూనిట్ల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొల్ల, కురమ వర్గాల వారు తమ సంప్రదాయ వృత్తులలో సాధికారత సాధించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఒక లక్షా 75 వేల రూపాయల వ్యయంతో 20 మేకలు ఒక పొట్టేలును అందించడం జరుగుతుందన్నారు. ఇందులో 1,31,250 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, 40,750 రూపాయలు లబ్ధిదారుడు చెల్లిస్తారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని, గొల్ల కురుమలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తెలంగాణ రాష్ట్రం గొర్రెల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, మేరాజ్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, రామకృష్ణ, గ్రామ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బాగా చదువుకోవాలనే ఆలోచనతో యువతరం

- విద్య అందుబాటులో ఉండాలి
- ప్రొఫెసర్ లింబాద్రి



**ముషీరాబాద్,విశాల భారతి:** యువతరం బాగా చదువుకోవాలనే ఆలోచనతో వస్తున్నారని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. అందుకు విద్య అందుబాటులో ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ప్రైవేట్ టీచర్స్ విద్యారంగానికి చేస్తున్న సేవకు గుర్తుగా ప్రైవేట్ టీచర్స్ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ లింబాద్రి, ప్రముఖ కవి జయరాజ్ హాజరై న్యూ చైతన్య జూనియర్ కాలేజ్ హిమాయత్ నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ కే వెంకటేష్ తో పాటు టీచర్స్ ను మెమోటోతో సత్కరించి అభినందించారు. అనంతరం ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక అవకాశాలతో పాటు విద్యారంగంలో తెలంగాణ ముందుకు వెళుతూ దేశానికి రాష్ట్రం ఓ మోడల్ గా ఉందని చెప్పారు. ఉన్నత విద్యారంగంలో తెలంగాణ మహిళలు 40 శాతం పైగా ఉండడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శని ఫౌండర్ టి రమేష్, ప్రొఫెసర్ శ్రీనివాస్, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ కన్వీనర్ ఏ విజయ్ కుమార్, కే విజయ్, సైదులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.






# అభివృద్ధికి ప్రతీకలుగా గ్రామ పంచాయతీలు

- ఆధునిక వసతులతో గ్రామపంచాయతీ భవనాలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఆలయం ఆవరణలో షెడ్డుకు రూ.5 లక్షలు విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్ చెరు(జిన్నారం), విశాలభారతి :** నాడు లక్ష రూపాయల నిధుల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితుల నుండి నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో కోట్ల రూపాయల నిధులతో గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలు గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో 40 లక్షల నిధులతో ని ర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం, జంగంపేట గ్రామంలో హెటరో సంస్థ సౌజన్యం తో 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగంపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమా వేశాల్లో ఆయన మాట్లాడుతూ...గత ప్రభుత్వాల హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పల్లెలు నేడు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేప డుతున్నామని తెలిపారు. గ్రామపంచాయతీగా ఏర్పడిన నాటి నుండి జంగంపేట గ్రామంలో నేటి వరకు రెండున్నర కోట్ల రూపాయలతో అభి వృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. జంగంపేట గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రకటించారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణా నికి 45 లక్షల రూపాయలు సిఎస్ఆర్ నిధులను కేటాయించిన హెటిరో డ్రగ్స్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందించారు. భవిష్యత్తు లోనూ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని వి జ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, పంచాయతీరాజ్ డిఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్ ను కలిసిన గాంధీ



**శేరిలింగంపల్లి,విశాలభారతి:** విదేశీ యాత్ర పర్యటన ముగించుకొని స్వదేశానికి చేరుకు న్న మంత్రి కేటీఆర్ ను ప్రభుత్వ విప్,శేరిలిం గంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శుక్రవా రం బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాల యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన్ను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల జాబితాలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ముచ్చటగా మూడోసారి శేరిలిం గంపల్లి ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారి టీతో గెలుపొంది ముఖ్యమంత్రి కేసీఆర్ కు కానుకగా ఇస్తామన్నారు.

# రేపే బీసీల సింహగర్జన..

- బిసిలు భారీగా తరలిరావాలి.
- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పిలుపు.
- అన్ని రాజకీయ పార్టీలు 60 శాతం బీసీలకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి.



**ముషీరాబాద్,విశాల భారతి:** సామాజిక న్యాయం సంబ్బంధ వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని మేము ఎంతో మాకు అంత రాజకీయ వాటా దక్కాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 10న (రేపు) సరూర్నగర్ స్టేడియంలో బీసీ సింహ గర్జన పేరిట భారీ బహిరంగ సభ ని ర్వహిస్తున్నామని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు.అన్ని రాజకీయ పార్టీలు 60 శాతం బీసీలకు ఎమ్మెల్యే గా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ లోని కులానికో సీటు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం దోమలగూడలోని తన కార్యాలయంలో జేఏసీ ఆధ్వర్యంలో వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి బీసీల సింహ గర్జన పోస్టర్ను గణేష్ చారి ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన నేటికి కూడా తరతరాలుగా సమాజంలో ఉన్న అన్ని జాతులకు అడుగడుగునా అన్యాయమే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధి కంగా జనాభా కలిగిన బీసీలను రాజకీయంగా ఎదగకుండా అణిచి వేస్తున్నారని మండిపడ్డారు. అన్ని రాజకీయ పార్టీలు మేలుకోవాలన్నా.., బీసీలు రాజ్యాధికారం చేపట్టాలన్న... 10న జరిగే బీసీ సింహగర్జనకు బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి బీసీల సత్త చూపించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.






# కొత్త ఔషధాలకు అధిక ధర, సుదీర్ఘ ప్రక్రియే సవాళ్లు

**పటాన్చెరువిశాలభారతి:** కొత్త ఔషధాలను మా ర్కెట్లలోకి తీసుకురావడానికి అధిక ధర, సుదీర్ఘ ప్ర క్రియే పెద్ద సవాళ్లని ఇన్నాచురా సైంటిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, వ్యవస్థాపకుడు డాక్టర్ నందన్ కుమార్ దుద్దుకూరి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీలో చిన్న మాలిక్యూల్ ఔషధ ఆవిష్కరణ రంగంలోని సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై శుక్రవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. యాంటీబయోటిక్స్ కు బ్యాక్టీరియాలో పెరుగు తున్న నిరోధకత సవాలును అధిగమించడంతో పాటు ప్రస్తుతం చికిత్స చేయలేని వ్యాధులకు కొత్త ఔషధాలను అభివృద్ధి చేయవలసిన తక్షణ అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రో డాక్ట్స్ ప్రాముఖ్యతను చెబుతూ, ఇది వర్ధమాన ఫార్మసిస్ఠకు గణనీయమైన నిధుల పొందే వెసులు బాటును కల్పిస్తోందన్నారు.విద్యార్థులు తదుపరి అధ్యయనాలను కొనసాగించాలని, ప్రోడాక్ట్స్ లో పెట్టుబడి పెట్టడం వల్ల భవిష్యత్తులో వచ్చే వ్యాధుల నివారణకు మార్గం సుగమం అవుతుం దని డాక్టర్ దుద్దుకూరి నొక్కి చెప్పారు. తొలుత, ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఎస్.కుమార్ అతిథిని స్వాగతించి, సత్కరించారు.





**మోహినియాట్టం..**

పరిశోధన విద్యార్థిని (రీసెర్చ్ స్కాలర్), దూరద ర్శన్ లో 'బీ' గ్రేడ్ ఆర్టిస్ట్ శ్రీజ శ్రీకాంత్ శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లో 'మోహినియాట్టం'ను ప్రదర్శించి, ఆహూతుల ప్రశంసలందుకున్నారు. ఆనందు మురళి (గాత్రం), టి.అక్షయ (నట్టువాంగం), శ్రీకాంత్ విశ్వనాథన్ (మృదంగం) ఆమెకు సహ కరించారు.

# అమిరెడ్డిపల్లి వాసి కె.రాజేందర్ కు డాక్టరేట్..



**హైదరాబాద్ విశాల భారతి:** గ్రామీణ పేద కుటుంబంలో పుట్టి, పాఠశాల విద్యను మధ్యలో ఆపేసి బాల కార్మికుడి గా ఆమిడిపల్లి వాసి కె రాజేందర్ మారారు. తర్వాత స్క్రీన్ రివర్స్ అయింది. చదువు పట్ల ఆసక్తితో ప్రైవేటుగా పదవ తరగతి ఉత్తీర్ణుడై నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెగ్యులర్గా ప్రథమ శ్రేణిలో పాసై స్సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాల నారాయణపేటలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. అక్కడే ఆదర్శ కాలేజ్ అఫ్ ఎడ్యుకేషన్ బీఈడీ పూర్తి చేసి,ప్రతిష్టాత్మక ఉస్మాని యా యూనివర్సిటీలో ప్రభుత్వ పాలనా శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీ ని ర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలో 18వ ర్యాంకు సాధించి ఐఏఎస్ఈ (ఇనిస్టిట్యూట్ అడ్వాన్స్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్) లో ఎడ్యుకేషన్ విభాగంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తర్వాత ప్రొఫెసర్ సి అరుణ జ్యోతి మార్గదర్శకంలో "ఈ గవర్నెన్స్ చేంజింగ్ నేచర్ అఫ్ అడ్మినిస్ట్రేషన్ స్టడీ ఆఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి అండ్ మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్స్ఆఫ్ తెలంగాణ స్టేట్ "అను అంశమును ఎంచుకొని అధ్యయన పత్రాలు సమర్పించడం జరిగింది. దానిని పరిశీలించిన ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు విద్యలో అత్యు న్నత పట్టా ఆయిన డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని (పీహెచ్డీ) మంజూరు చేశారు.ఈ పరిశోదన పూర్తి చేయడంలో తనకు సహకరించిన ప్రొఫెసర్ లింబాద్రి,ప్రొఫెసర్ పార్థసారథి,ప్రొఫెసర్ అమరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ బాల బ్రహ్మాచారి,డాక్టర్ రజిత సింహారెడ్డి, సూర్యలక్ష్మి డిగ్రీ కాలేజ్ , డాక్టర్ మొయినుద్దీన్, రెడ్యప్ప స్కూల్ అసిస్టెంట్ బొమ్మన్ పాడ్ మరియు కుటుంబ సభ్యులు మిత్రులదరికి కృతజ్ఞతలు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దినపత్రిక
vishalabharathi
Telugu Daily
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
04 | శనివారం, 09 సెప్టెంబర్ 2023 హైదరాబాద్

# పనిలే'కుండ'

- కడుపు నింపని కుమ్మరి కుండలు
- భారంగా కుమ్మరి బతుకులు
- చేతి వృత్తులను ఆదుకోని ప్రభుత్వాలు
- అడ్డా కూలీలుగా చేతి వృత్తి దారుల అవతారం



**శేరిలింగంపల్లి విశాల భారతి:** మన పూర్వీకుల కాలం నుంచి నేటి వరకు మట్టి పాత్రలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. శుభకార్యాలు,అశుభ కార్యాలు నిర్వహించాలన్న వీటితోనే ప్రారంభిస్తారు.ఇప్పటికీ ఈ వస్తువులు లేకుండా కొన్ని కార్యక్రమాలు పూర్తి కావు. ప్రముఖ పాత్ర పోషిస్తున్న నేటి సమాజంలో వీటి ప్రాధాన్యత తగ్గి ప్లాస్టిక్ స్టీల్ రెడీమేడ్ వస్తువులు అందుబాటులోకి వచ్చాయి.అనాదిగా కుల వృత్తులు చేసుకుంటూ వాటి మీదే ఆధారపడి బతుకుతున్న కుమ్మరుల బతుకులు రోడ్డున పడుతున్నాయి. గతంలో గ్రామాల్లో,పట్టణాల్లో,ఇళ్లకు వాడే మట్టి పెంకులకు భలే గిరాకీ ఉండేది.వేసవికాలం వచ్చిందంటే కుండలు,మట్టి పాత్రలు ఎక్కడ కనిపించినా అక్కడకు వచ్చి జనం తీసుకొని వెళ్ళేవారు. ప్రస్తుతం ఫ్రిజ్లు, కూలర్లు,వంటివి రావడంతో అనాదిగా కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారి బతుకులు దయనీయంగా మారాయి.రెక్కాడితే గాని డొక్కాడని వీరికి గిరాకీ తగ్గి, పెట్టుబడులు పెరిగి తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. అన్ని కులాలకు తెలంగాణ ప్రభుత్వం సాయం చేస్తోంది కానీ కుమ్మరి కులస్తులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కుమ్మరులు. గతంలో మట్టిని ఉచితంగా సేకరించి ఇంటిల్లిపాది కష్టపడి నాలుగు రాళ్లు పోగేసుకునే వారమని ఇప్పుడు పరిస్థితి తారుమారైందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క కుండను చేయడానికి మట్టికే ఖర్చు ఎక్కువ అవుతుంది అని అంటున్నారు.ఒక పక్క కుండలు,పాత్రలు చేయడానికి మట్టి దొరకక మరోపక్క మట్టి లభ్యత ఉన్నచోట అధికంగా డబ్బులు వెచ్చించి తీసుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు.మట్టిని, ఇసుకను,సున్నపురాళ్లను నానబెట్టి రాత్రింబవళ్ళు కష్టపడి తయారు చేస్తే వాటిని కొనేవారు లేక బతుకు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ధరల పెరుగుదల మా జీవితాలను మరింత దుర్భర పరిస్థితుల్లోకి నెడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.వంశపారపర్యంగా వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న నేటి సమాజంలో అడ్డాకూలీలుగా,దుకాణాల్లో రోజువారి కూలీలుగా బతుకీడుస్తున్నట్లు గోడు వెళ్లబోసుకుంటున్నారు.అన్ని కులాల మాదిరిగానే కుమ్మరి కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### రోజంతా పని చేసిన పూట గడవడం లేదు...!



ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేసిన సరైన కూలీ రాకపోవడంతో అనేకమంది కార్మికులుగా మారుతున్నారు. కుల వృత్తిని నమ్ముకొని ఆనాదిగా కుండలను తయారు చేసి విక్రయిస్తున్న పూట గడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు కుల వృత్తిదారులకు ఉపయోగపడటంలేదు. ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదు. ప్రస్తుతం కులవృత్తులకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న తెలంగాణ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు. ఇప్పటికి ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి, పోయాయి తప్ప కుమ్మర కులస్తులకు ఏ ప్రభుత్వం ఆదుకోవడానికి ముందుకు రావడం లేదు.

-కుమ్మరి జితేందర్,హాఫీజ్ పేట్.

### కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలి....!



గతంలో ఎండాకాలం వచ్చిందంటే కుండలు మట్టి పాత్రలు ఎక్కడ ఉన్న అక్కడికి వచ్చి జనం తీసుకుని వెళ్ళేవారు ప్రస్తుతం ప్రజలు కూడా రావడంతో వృత్తిని నమ్ముకొని చూసిన వారి బతుకులు దయనీయంగా మారాయి అన్ని కులాలను ప్రభుత్వం సాయం చేస్తుంది కాని కుమారులను పట్టించుకోవడం లేదు ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

-లక్ష్మమ్మ గంగారం.





# తుర్కపల్లి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి

**మేడ్చల్,విశాలభారతి:**శామీర్ పేట మండలం తుర్కపల్లిలో సంసద్ ఆదర్శ్ గ్రామయోజన కార్యక్రమాన్నిగ్రామ ఉపసర్పంచ్ యూసుఫ్ఆ ద్వర్యంలో శుక్రవారం పంచాయతి ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంవొఆర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్సె క్రటరీ రాహుల్ కశ్యప్ విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. వైస్ ఎంపిపి ఎల్లు సుజాత, గ్రామ ఉపసర్పంచ్ యూనుఫ్ లు సంసద్ ఆదర్శ్ గ్రామయోజన ప్రతినిధులకు గ్రామానికి కావాల్సిన వనతుల కొరకు వినతి పత్రం ఇచ్చారు. వ్యవసాయంలో భాగంగా రైతులు డ్రోన్ సహాయంతో విత్తనాలు, ఫెర్టిలైజర్స్ చల్లుటకు చర్చించారు. అనంతరం జనాభాకు అనుకూలంగా 50 పడకలఆస్పత్రి నిర్మాణించాలని కోరారు. రైతులు పండించిన పంటలను స్టోర్ చేయుటకు కోల్డ్ స్టోరేజ్లు గోదాములు కావాలన్నారు. మినీ ఫంక్షన్ హాల్, క్రీడా ప్రాంగణము, డ్వాక్రా భవనం, పాల ఉత్తత్తుల్లో బాగంగా పాల డైరీ ఏర్పాటు, చేపల ఉత్తత్తి అధికంగా ఉన్నందున రవాణా కోసం ఆటోలు, దోభిఘాట్ లో వాషింగ్ మిషిన్లు, యువతి యువకులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించడానికి కంప్యూటర్ సెంటర్, యువకులు శారీరకంగా దృడంగా ఉండేందుకు వ్యాయామశాలలు ఎంతగానో దోహదపడతాయని అందుకోసమే ఓపెన్ జిమ్ ను ఏర్పాటు చేయుటకు మంజూరు చేయాలని గ్రామయోజన ప్రతినిధులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్అండ్ ఆర్డి జాయింట్ కమిషనర్ నర్సింలు, పిఆర్అండ్ ఆర్డ ఎనిఎం శ్యామల, డిఆర్డిఎ పిడి పద్మజరాణి, డిపివో రమణమూర్తి, ఎంపిడివో వాణి, కార్యదర్శులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

# కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీట్ కేటాయించండి

**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రేను కోరిన రుద్ర శంకర్.**



**హైదరాబాద్,విశాల భారతి:** కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీటును తనకు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుడు గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రుద్ర శంకర్ కోరారు. ఈ మేరకు హైదరాబాదులోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రేను కలిసి తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని రుద్ర శంకర్ అభ్యర్థించారు. అనంతరం రుద్ర శంకర్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గల్ఫ్ కార్మికుల పక్షాన నిలిచి వారి సాధక బాధలు తెలుసుకొని వారికి అండగా నిలబడ్డానని తెలిపారు. ఉత్తర తెలంగాణ మధ్యలో కోరుట్ల నియోజకవర్గం ఉందని ఈ నియోజకవర్గంలో 56 వేల ఓట్లు కేవలం గల్ఫ్ కుటుంబాలయే ఉన్నాయని, బీసీలు 80 వేలు, పద్మశాలి లో 70 వేలు ఉన్నందున తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తోపాటు అధిష్టాన్ని కోరన్నారు. 90 శాతం బీసీలు ఉన్నందున తనకు టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయని మాణిక్ రావ్ ఠాక్రే దృష్టికి తీసుకెళ్లాలని వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# రెండోరోజు ప్రారంభమైన గడప గడపకు బీజేపీ

**ఆర్కేపురం డివిజన్ లో శ్రీరాములు ఇంటింటికీ వెళ్లి ప్రచారం**



**మహేశ్వరం, విశాల భారతి:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ లో రెండోరోజు సౌభాగ్యపురం కాలనీలో గడప గడపకు బీజేపీ కార్యక్రమం కొనసాగుతోంది. స్థానిక బీజేపీ కార్పొరేటర్ రాధా ధీరజ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్రమోడీ గారు చేస్తున్న అభివృద్ధి, దేశ సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు బీజేపీ నాయకులు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయారని మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో కారెక్కిన మంత్రి సబితమ్మ సైతం ప్రజా సమస్యలను గాలి కొదిలేసి ఎంఐఎం పార్టీ సేవలో ఓట్ల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఆర్కేపురం డివిజన్ లో కొనసాగుతున్న పాదయాత్రలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, పిట్ట ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ముంతా రాములు, సిద్దూ ముదిరాజ్, వెంకటరెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, కరుణ సహా బీజేపీ, బీజేవైఎం నాయకులు సహా మహిళా మోర్చా నాయకురాళ్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన జేపీఆర్ 'ప్రజాచైతన్య యాత్ర'

- చైతన్యపురి డివిజన్‌లో అనూహ్య స్పందన
- 'సీటు నాదే.. గెలుపు నాదే' అంటూ ప్రభాకర్‌రెడ్డి ధీమా



**ఎల్బీనగర్, విశాల భారతి:** ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి చేపడుతున్న ప్రజా చైతన్య పాదయాత్ర శుక్రవారం చైతన్యపురి డివిజన్ లో వికాస్ నగర్ నుంచి దుర్గా నగర్, ద్వారకాపురం, గణే శ్‌పురి కాలనీ, మున్సిపల్ కాలనీ, హనుమాన్ నగర్, ప్రభావత్ నగర్, మారుతీ నగర్ మీదుగా సత్యా నగర్ గాంధీ విగ్రహం వరకు సాగింది. యాత్రలో భాగంగా ప్రభాకర్‌రెడ్డి కాలనీవాసులను, వాహనదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ లో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు గా కాలనీ సమస్యలు దర్శనమిస్తున్నాయన్నారు. ఎంతో కాలంగా వికాస్ నగర్ లో డ్రైనేజీ సమస్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. డివిజన్ లో చాలా మందికి వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందడం లేదని జేపీఆర్‌తో మొరపెట్టుకున్నారు. తేలికపాటి వర్షాలు పడగానే మున్సిపల్ కాలనీ, వికాస్ నగర్ వరద ముంపునకు గురవుతోందని తెలిపారు. డివిజన్ లో గంజాయి విక్రయిస్తున్న యువకులు, స్థానిక మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, మహిళల రక్షణపై ఎమ్మెల్యే సుధీర్ఏం చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో సమస్యలను గాలికి వదిలేసి, అభివృద్ధి అని ఉత్త మాటలు చెప్పే సుధీర్ రెడ్డిని, ఈ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రతి సమస్యను పరిష్కరిస్తానని జేపీఆర్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ సీటు నాదే.. గెలుపునాదే అంటూ ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ అధ్యక్షులు, కుక్కునూరు శశిధర్ రెడ్డి, యువ నాయకులు ఎరమల రాంరెడ్డి, యశ్వంత్ రెడ్డి, సీనియర్ నాయకులు, సతీష్ రెడ్డి, పృధ్వీరాజ్,శ్యామలరెడ్డి, మైనార్టీ నాయకులు, అక్రమ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు కార్యకర్తలు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.